ఆరోగ్య సమాజంతోనే మెరుగైన ఫలితాలు : కలెక్టర్



2కే రన్ ప్రారంభిస్తున్న నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పరిశుభ్రత, పచ్చదనంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని తద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ నాగరాణి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వం డిగ్రీ కళాశాల వద్ద కలెక్టర్ నాగరాణి జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బెలూన్‌లను ఎగుర వేసి మాట్లాడారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచే బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి ఆర్డీవో, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి, కమిషనర్ రామ్‌కుమార్, తహసీల్దార్ అశోక్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా ఆసుపత్రి వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాధాకృష్ణతో పాటు కలెక్టర్ నాగరాణి సందర్శించి మాట్లాడారు.

రేషన్ కార్డుల సర్దుబాటుపై విజ్ఞప్తి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: చౌక డిపోల డీలర్ల సంఘం ప్రతినిధులు సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డిని మంగళవారం కలిశారు. డీలర్లందరికీ రేషన్ కార్డులను సమానంగా సర్దుబాటు చేయాలని, ఎంఎల్ఎస్ కేంద్రాల వద్ద సరకులన్నింటికీ ఒకేసారి వేలిముద్ర వేయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

విధేయతకు సముచిత స్థానం

ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి కీలక పదవులు

ఈనాడు, ఏలూరు, వీరవాసరం, ఉండి, న్యూస్‌టుడే: కూటమి సర్కారు విధేయతకు సముచిత స్థానం కల్పించింది. కష్టకాలంలో తమ సీట్లను సైతం త్యాగం చేసి పార్టీ విజయం కోసం పని చేసిన ఉమ్మడి పశ్చిమలోని ముగ్గురు తెదేపా నేతలకు కీలక పదవులు కట్టబెట్టింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్‌గా తెదేపా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, ఏపీ ట్రైకార్ ఛైర్మన్‌గా (ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్) పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి ఛైర్‌పర్సన్‌గా మాజీ మంత్రి పీతల సుజాతను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.

త్యాగాలకు గుర్తింపు..

పదవులు దక్కిన ముగ్గురు నేతలు తొలి నుంచి పార్టీ నియమావళికి కట్టుబడి పని చేశారు. అధినేత ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్నారు. తీరా పొత్తుల్లో భాగంగా సీట్ల సర్దుబాటులో వీరు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం కోల్పోయినా పార్టీకి విధేయంగా వ్యవహరించారు. కూటమి అభ్యర్థులు ఎవరైనా తామే పోటీలో ఉన్నట్లు భావించి పార్టీ విజయానికి కృషి చేశారు. ఇంత కష్టపడిన నేతలకు అధినేత సైతం సముచిత స్థానాలు కట్టబెట్టి గౌరవించారని పార్టీ శ్రేణుల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.



అధినేత మాటే శాసనంగా..

2019లో వైకాపా హోరులో ఉమ్మడి పశ్చిమ నుంచి విజయం సాధించిన ఇద్దరిలో రామరాజు ఒకరు. తాజా ఎన్నికల్లో సైతం తొలి జాబితాలో ఆయనకు ఎమ్మెల్యే సీటు ఖరారైంది. అనూహ్య పరిణామాలతో ఉండి సీటును పార్టీ అధిష్ఠానం రఘురామకృష్ణరాజుకు కేటాయించి తెదేపా జిల్లా పగ్గాలను రామరాజుకు అప్పగించింది. అధినేత మాటే పరమావధిగా శక్తి వంచన లేకుండా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఆయన త్యాగానికి సరైన గుర్తింపు దక్కింది.

రాజకీయ నేపథ్యం

2006లో కలవపూడి సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2007లో తెదేపాలో చేరిన ఆయన 2009, 2014 ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో వైకాపా హవాలోనూ ఉండి నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసి 10,949 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. విపక్ష ఎమ్మెల్యేగా ప్రజా ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు.

2009లో ప్రజారాజ్యం తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో తెదేపా టికెట్ కోసం యత్నించి విఫలమయ్యారు. పట్టు విడవకుండా 2019 ఎన్నికల్లో టికెట్ దక్కించుకుని పోటీ చేసినా విజయం వరించలేదు. అప్పటి నుంచి పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ విపక్ష పాత్రను సమర్థంగా పోషించారు. 2024లో మరోసారి అవకాశం చేజారింది. తాజాగా అధిష్ఠానం ఆశీస్సులతో ట్రైకార్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

2004 ఎన్నికల్లో తొలిసారి ఆచంట నుంచి తెదేపా అభ్యర్థిగా నిలిచి గెలుపొందారు. 2009లో టికెట్ దక్కకపోయినా పార్టీ కోసం పనిచేశారు. 2014లో చింతలపూడి నుంచి బరిలో నిలిచి 15 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొంది మంత్రి పదవి దక్కించుకున్నారు. 2019, 2024 ఎన్నికల్లో సీటు దక్కకపోయినా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.



పొత్తు ధర్మానికి కట్టుబడి

తెదేపా పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల పొత్తు ధర్మంలో భాగంగా పోలవరం సీటు జనసేనకు కేటాయించారు. కార్యకర్తలు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా ఆయన మాత్రం ఎక్కడా పార్టీ ఆదేశాలను అతిక్రమించలేదు. చెదిరిపోతున్న కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. రెండు పార్టీల మధ్య సమన్వయం సాధించి కూటమి అభ్యర్థి విజయ తీరాలకు చేరడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన కృషికి సముచిత స్థానం దొరికింది.



పార్టీనే తల్లిగా భావించి..

పీతల సుజాత రెండు దశాబ్దాలుగా పార్టీని అంటిపెట్టుకుని వీర విధేయురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పటికీ 2019, 2024లో పోటీ చేసే అవకాశం దక్కకున్నా పార్టీనే తల్లిగా భావించి కొనసాగారు. పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని జిల్లాలో ముందుకు తీసుకెళ్లడంలో చాలా చురుగ్గా పని చేశారు. మహిళల సమస్యలపై పోరాటం చేశారు. దీంతో సీఎం చంద్రబాబు సైతం ఆమెకు మంచి పదవి ఇచ్చి గౌరవించారు.

నిషేధం ఎత్తివేత ఎవరికోసం..!

జిల్లాలో 14,766 ఎకరాలు అసైన్‌మెంట్ జాబితా నుంచి తొలగింపు


వైకాపా హయాంలో తీసుకున్న నిర్ణయంపై పునఃపరిశీలన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఒకటి రెండు కాదు ఏకంగా 14,766 ఎకరాల అసైన్‌మెంట్ భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో నిషేధిత జాబితా (22 (ఏ)) నుంచి తొలగించారు. దీంతో ఆయా భూముల లబ్ధిదారులు క్రయవిక్రయాలు చేసుకునేందుకు వీలుకలిగింది. వీరంతా 2003కు ముందు ప్రభుత్వం నుంచి పట్టాలు పొందిన పేదలు. వాస్తవానికి ఈ భూములను పట్టాలు పొందిన వ్యక్తులు, వారి వారసులు మాత్రమే సాగు చేసుకోవడానికి ఉండేది. దీంతో అసైన్ భూములు అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉండేది కాదు. ఈ ప్రక్రియ గతేడాది డిసెంబరు నుంచి ఈ ఫిబ్రవరి మధ్య జరిగింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారుల నియామకం.. జిల్లాలో పలు మండలాల్లో నిషేధిత ఉత్తర్వుల ఎత్తివేతలో లబ్ధిదారుల పారదర్శకత ఎంత ఉందోనని ప్రభుత్వం పునఃవిచారణ చేపట్టింది. ఇందులో భాగంగానే ప్రతి రెండు, మూడు మండలాలకు ఆర్డీవో, ఆపై స్థాయి రెవెన్యూ అధికారులను విచారణకు నియమించారు. కొద్దిరోజులుగా ఆయా మండలాల్లో అసైన్‌మెంట్ దస్త్రాల పునఃపరిశీలన జరుగుతోంది.

వేల ఎకరాలు.. జిల్లాలో మెట్ట, మన్యం మండలాల్లోనే భూముల హక్కుల కల్పన ఎక్కువగా జరిగింది. కామవరపుకోటలో 3,222, ద్వారకాతిరుమల 2,083, చింతలపూడి 1,433, టి.నరసాపురం 1,322, నూజివీడు 1,063, ఆగిరిపల్లి 982, లింగపాలెం 836, బుట్టాయగూడెం 701, కొయ్యలగూడెం 563, పెదవేగి 516, జంగారెడ్డిగూడెం 33 ఎకరాల చొప్పున హక్కులు కల్పించారు. విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో జరగలేదు. నిడమర్రు, ఏలూరు అర్బన్, రూరల్ మండలాల్లో ఒకటి రెండెకరాలకు మాత్రమే హక్కులు కల్పించారు.

శ్రీవారి ఆలయ ఈవోగా బాధ్యతల స్వీకరణ



ఎన్వీఎస్ఎన్ మూర్తి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ఈవోగా నియమితులైన ఎన్వీఎస్ఎన్ మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తితిదే ఆర్జేసీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ద్వారకాతిరుమలలో పనిచేసిన వేండ్ర త్రినాథరావు సింహాచలం వెళ్లారు. ఈ సందర్భంగా దేవస్థానం మాధవ కల్యాణ మండపంలో త్రినాథరావును ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఈ భాస్కర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోధనా సిబ్బంది నియామకాలకు అడుగులు

నిట్‌లో తీరనున్న అధ్యాపకుల కొరత

ఏపీ నిట్, (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని నిట్‌లో సిబ్బంది కొరతతో సీట్లను సైతం కుదించారు. 120 సీట్లతో ప్రారంభమైన ఈ ప్రాంగణం క్రమేణా 750కు పెంచారు. అనంతరం సిబ్బంది కొరతతో 480 సీట్లకు కుదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఇన్‌ఛార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి బోధనా సిబ్బంది నియామకాలకు ప్రకటన విడుదల చేశారు. ఏపీ నిట్‌లో ప్రస్తుతం సుమారు 2,300 మంది విద్యార్థులు ఉన్నారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం 12 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలి. 202 అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కేవలం 43 మంది మాత్రమే విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. 222 మంది బోధనేతర సిబ్బంది ఉండాల్సి ఉండగా 69 మంది ఉన్నారు. కొన్నేళ్ల కిందట 24 మంది బోధనా సిబ్బంది నియామకాలకు ముఖాముఖీలు నిర్వహించారు. 19 మందిని విధుల్లోకి తీసుకున్నారు. తాజాగా మరో 127 మంది బోధనా సిబ్బంది నియామకానికి ప్రకటన జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలో ముఖాముఖీలు జరగనున్నాయి. బోధన సిబ్బంది నియామకాలు పూర్తయిన తర్వాత బోధనేతన సిబ్బంది నియామకాలు చేపట్టనున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు జరిగితే కోల్పోయిన సీట్లను తిరిగి ప్రారంభించే అవకాశం ఉంది. "నిట్‌లో సిబ్బంది నియామకాలకు చర్యలు తీసుకున్నాం. త్వరలో అన్ని పోస్టులు భర్తీ చేసేందుకు కృషి చేస్తాం." అని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

సాంబారులో పిండి ముద్దలు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఘటన



నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్‌లో మంగళవారం రాత్రి విద్యార్థులకు అందించిన సాంబారులో పిండి ముద్దలు వచ్చాయి. కళాశాల ఆవరణలోని డీహెచ్ 5 మెస్‌లో భోజనం చేసేందుకు వచ్చిన విద్యార్థులకు సాంబారులో పిండి ముద్దలు కనిపించడంతో మధ్యలోనే భోజనం పడేసి వెళ్లిపోయారు. యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పదే పదే ఇలా జరుగుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి లక్ష్మణరావును వివరణ కోరగా.. వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ బడిలో.. ఇద్దరే విద్యార్థులు



తరగతి గదిలో విద్యార్థిని, ఉపాధ్యాయుడు



గరవల్లదిబ్బలో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం లోసరి పంచాయతీ గరవల్లదిబ్బలో ఎంపీపీ పాఠశాల భవనాన్ని నాడు- నేడులో రూ.15.14 లక్షలతో నిర్మించారు. ప్రభుత్వం గుత్తేదారుల సంస్థ ద్వారా సరఫరా చేసిన కిటికీలు, గుమ్మాలు, టైల్స్, విద్యుత్తు పరికరాలకు మరో రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. కానీ ఈ బడిలో ప్రస్తుతం దస్త్రాల ప్రకారం.. ఇద్దరు పిల్లలు మాత్రమే చదువుతున్నారు. వారిలోనూ ఒకరు సక్రమంగా హాజరుకావడం లేదు. ఇక్కడ ఒకటి నుంచి అయిదు వరకు తరగతులు ఉండగా ఒక ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. తీర ప్రాంత జాతీయ రహదారి విస్తరణ సమయంలో ఈ పాఠశాల భవనాన్ని తొలగించారు. తర్వాత చాలాకాలం పాటు స్థానిక రామాలయం ఆవరణలో తరగతులు నిర్వహించారు. అప్పట్లో 20 మందికి పైగా విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. తర్వాత విద్యార్థుల సంఖ్య 14కి, గతేడాది ఎనిమిది, ప్రస్తుతం రెండుకు పడిపోయింది. ఈ అంశంపై ఎంఈవోలు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు స్పందిస్తూ ఇటీవల క్షేత్ర పరిశీలన చేసినప్పుడు ఆ పాఠశాలలో ఒకే విద్యార్థే ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయుడిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. స్థానిక నాయకులను కలిసి విద్యార్థులను చేర్పించేలా అవగాహన కల్పించాలని కోరినట్లు వెల్లడించారు.

వర్జీనియాకు మహర్దశ


☛ రికార్డు స్థాయికి ధరలు ☛ గరిష్ఠంగా కిలో రూ.410కి చేరటంతో రైతుల్లో ఆనందం



జంగారెడ్డిగూడెం వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్ల వాహనాలు

ఈనాడు, ఏలూరు: వర్జీనియా పొగాకుకు మహర్దశ పట్టింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉమ్మడి పశ్చిమలో ధరలు నమోదయ్యాయి. దేశంలోనే నాణ్యమైన పొగాకు కావడంతో గరిష్ఠంగా కిలో రూ.410 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర విదేశీ మారకం ద్రవ్యం కూడా పెరగనుంది. పెరిగిన ధరలతో వేలం కేంద్రాలకు వచ్చిన రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గతంలో ఎన్నడూ లేని విధంగా.. ప్రపంచంలో వర్జీనియా ఉత్పత్తి, ఎగుమతుల్లో బ్రెజిల్, జింబాబ్వే, చైనా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. తర్వాత స్థానంలో ఇండియా ఉంది. దేశంలో అత్యంత నాణ్యమైన పొగాకు ఉమ్మడి పశ్చిమలోనే లభిస్తోంది. ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో పంట ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ధరలు లేవు. గత సీజన్‌లో బ్రెజిల్, జింబాబ్వే భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో 30 శాతం దిగుబడి తగ్గింది. చైనాలో అక్కడి ప్రభుత్వ విధానాలతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ఉమ్మడి పశ్చిమలోని వర్జీనియాకు భారీ డిమాండ్ ఏర్పడింది. జంగారెడ్డిగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, దేవరపల్లిలోని వేలం కేంద్రాలకు వ్యాపారులు క్యూ కడుతున్నారు. గత 12 ఏళ్లలో కిలో వర్జీనియా ధర రూ.150-290 మధ్యలోనే ఉంది. ఈ సారి మాత్రం రికార్డు స్థాయిలో కిలో రూ.410 చేరింది. రూ.120 వరకు పెరిగింది. 1984లో జిల్లాలో పొగాకు బోర్డు వేలం కేంద్రాలు ఏర్పాటు కాగా ఈ స్థాయిలో ధర పలకడం ఇదే ప్రథమం.



రూ.7 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం..

ఉమ్మడి పశ్చిమలో గతంలో 18 వేల హెక్టార్లలో వర్జీనియా సాగు జరిగేది. ప్రస్తుతం ఇది 21 వేల హెక్టార్లకు పెరిగింది. ఒక్కో హెక్టారుకు సగటున 2600 కిలోల వర్జీనియా దిగుబడి వస్తోంది. 16,500 వరకు పొగాకు బ్యారన్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రూ.2,800 కోట్ల విలువైన వర్జీనియా అమ్మకాలు జరిగాయి. ఇక్కడి నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు సముద్ర మార్గాల్లో గల్ఫ్, ఐరోపా దేశాలకు వీటిని ఎగుమతి చేస్తారు. దీని ద్వారా ఏటా రూ.6 వేల కోట్ల వరకు విదేశీ మారక ద్రవ్యం సమకూరుతోంది. ఈ ఏడాది ధర భారీగా పెరగడంతో రూ.వెయ్యి కోట్లు పెరిగి రూ.7 వేల కోట్ల వరకు చేరనుంది. దీనిపై జంగారెడ్డిగూడెం వేలం నిర్వహణాధికారి శ్రీహరి మాట్లాడుతూ..'రికార్డు స్థాయిలో ధరలు ఉన్నాయని రైతులు ఎక్కువ పెట్టుబడులు పెడితే వచ్చే ఏడాది ఈ ధరలు ఉండకపోవచ్చు.. ఇతర దేశాల్లో కొరత వల్ల ఈ స్థాయి ధరలు ఉన్నాయి. కాబట్టి పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు.

ప్రజా భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ నాగరాణి కోరారు. స్వర్ణాంధ్ర సాధన ప్రణాళిక కోసం అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ నుంచి http://swarnandhra.ap.gov.in/suggetions లింక్‌తో వచ్చే క్యూఆర్ కోడ్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి చిత్రం, సంతకంతో వచ్చే ధ్రువీకరణ పత్రాన్ని పొందవచ్చన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేశాక పేరు, చరవాణి సంఖ్య, ఈ-మెయిల్ తదితర వివరాలను పొందుపరచాలన్నారు. అనంతరం ఓటీపీ నమోదు చేసి ప్రశ్నావళి ఆధారంగా అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ★ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై యంత్రాంగం దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఏడు వైద్య శిబిరాలు నిర్వహించి 1,074 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిపారు.

కాళ్లలో 52.2 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు 5.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కాళ్ల మండలంలో 52.2 మి.మీ. వర్షం కురిసింది. మండలాల వారీగా ఉండి- 22.2, ఇరగవరం- 19, పెనుమంట్ర- 14.2, పెనుగొండ- 4.2, నరసాపురం- 2.8, పెంటపాడు, యలమంచిలి- 1.4, ఆకివీడు- 1.2 మి.మీ. చొప్పున వర్షం కురిసింది.

కొత్త విద్యుత్తు సర్కిళ్లకు ఎస్ఈలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త విద్యుత్తు సర్కిళ్లు ఏర్పాటు కానున్న నేపథ్యంలో... పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఈగా ఎ.రఘునాథబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సీఎండీ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడేళ్ల కిందట జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాక.. కొన్ని శాఖలను జిల్లాల వారీగా విభజించి ఎక్కడికక్కడ కార్యాలయాలు ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందిని కేటాయించారు. విద్యుత్తుశాఖను మాత్రం ఉమ్మడి జిల్లాల్లోనే కొనసాగించారు. దీంతో విద్యుత్తు శాఖ ఏలూరు కేంద్రంగానే పని చేస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఇకపై ఏలూరు, పశ్చిమ గోదావరి సర్కిళ్లుగా విడిపోనున్నాయి. తాజా బదిలీల్లో పశ్చిమ సర్కిల్‌కు సిబ్బందిని కేటాయించారు. భీమవరం డీఈ కార్యాలయాన్ని ఎస్ఈ కార్యాలయంగా మార్చి పశ్చిమ గోదావరి సర్కిల్ కార్యకలాపాలు నిర్వర్తించారు. ఈ సర్కిల్‌లో భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం సబ్ డివిజన్లు ఉండనున్నాయి. ఇక ఏలూరు సర్కిల్‌కు ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్లు మాత్రమే మిగిలాయి. ఇందులో కొత్తగా కృష్ణా జిల్లా గుడివాడ, నూజివీడు డివిజన్‌లోని కైకలూరు, నూజివీడు, హనుమాన్‌జంక్షన్‌ను కలపనున్నారు.

ఈఈగా వెంకటేశ్వర రావు

గునుపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు పంపిణీ సంస్థ ఈఈగా ఎన్.వెంకటేశ్వరరావు పారిశ్రామికవాడలోని కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందుకు ఆయన పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేదపండితుడు ఫణిశర్మ అమ్మవారి ఆశీర్వాదం, దేవస్థానం సహాయ కమిషనర్ బీఎం నగేశ్ శేషవస్త్రం, ప్రసాదం అందించారు. గతంలో తాడేపల్లిగూడెంలో పనిచేసిన ఆయన బదిలీపై భీమవరం వచ్చారు.

సంరక్షణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

ఈనాడు కథనానికి స్పందన



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ భారతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందక బక్కచిక్కిపోతున్నారని, నిర్వాహకుల లైంగిక వేధింపులకు గురవుతున్నారని 'సంరక్షణ కేంద్రాల్లో కీచకపర్వం' శీర్షికన మంగళవారం ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ సాయినీ విజయ భారతి మంగళవారం రాత్రి సంబంధిత సరంక్షణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ ఛైర్మన్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: స్థానిక ఇండోర్ మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్-14, 17 విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్, కరాటే, స్కేటింగ్, పవర్ లిఫ్టింగ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వెయిట్ లిఫ్టింగ్‌లో 15, కరాటేలో 40, స్కేటింగ్‌లో 36 మందిని ఎంపిక చేశారు.

బాలబాలికల అథ్లెటిక్స్..**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** స్థానిక ఏఎస్ఆర్ మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్- 10, 12, 14, 16, 18, 20 విభాగాల్లో(పరుగు, జావెలిన్‌త్రో, హైజంప్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో) బాలబాలికల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 420 మంది హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుళ్లా ప్రసాదరావు, కార్యదర్శి దేవరపల్లి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఆయా క్రీడలకు సంబంధించి 110 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అక్టోబరు 4 నుంచి 6 వరకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో ఏలూరు జిల్లా తరపున పాల్గొంటారు.



రగ్బీ జిల్లా జట్లు.. **పెదవేగి, న్యూస్‌టుడే:** స్థానిక గురుకుల బాలుర పాఠశాలలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్-19 రగ్బీ బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నలుమూలల నుంచి సుమారు 220 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు.

కర్రలతో పోటీ.. వారికి వారే సాటి!

కలిదిండి, న్యూస్‌టుడే

కర్రసాములో సత్తా చాటుతున్న విద్యార్థినులు

గ్రామీణ ప్రాంతాల్లో పూర్వం కర్రసాముకు ఎనలేని ప్రాధాన్యం ఉండేది. కాలక్రమంలో దీని సాధన చేసే వాళ్లు కరవయ్యారు. ఈ క్రమంలో కలిదిండి బాలికలు కర్రసాముకు మళ్లీ ఊపిరి పోస్తున్నారు. అలవోకగా చెయ్యి తిప్పుతూ.. బహుమతుల పంట పండిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ చాటారు. తొమ్మిది జిల్లాల నుంచి 270 మంది పోటీ పడగా.. 22 మంది కలిదిండి విద్యార్థులు 40 బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఆత్మ రక్షణకూ ఉపయుక్తంగా..



'కర్రసాముతో ఏకాగ్రత, శారీరక వ్యాయామం, మానసిక దృఢత్వంతోపాటు మహిళల ఆత్మ రక్షణకూ ఉపయుక్తంగా ఉంటుంది. ఈ క్రీడ అరుదుగా ఉండటంతో దీనిపై ఆసక్తి కలిగింది. మొక్కుబడిగా కాకుండా పట్టుదలతో సాధన చేయడంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైట్ విభాగంలో వెండి, సింగిల్ - డబుల్ స్టిక్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించగలిగానని' పి.ప్రమోద చెబుతోంది.

ఆడ పిల్లలకెందుకు అన్నారు..



'కర్రసాము నేర్చుకుంటా అంటే మొదట్లో చాలామంది ఆడ పిల్లలకెందుకు అన్నారు. అవేమీ పట్టించుకోకుండా సాధన చేయడం ప్రారంభించా. కష్టంగా అనిపించింది. అయినా.. వదల్లేదు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఫైల్ విభాగంలో బంగారు పతకం, సింగిల్, డబుల్ స్టిక్ విభాగాల్లో వెండి పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో రాణించాలనేది నా లక్ష్యం. ఆ దిశగా సాధన చేస్తున్నా..'అని జి.తేజదుర్గశ్రీ వివరించారు.

బంగారు పతకాలు సాధిస్తా..



'ఇతర క్రీడలకంటే కర్రసాము ప్రత్యేకంగా ఉంది. దీనిలో రాణించడం చాలా కష్టం అన్నారు. ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయని అనిపించింది. మొదట్లో నా వల్ల కాలేదు. పట్టుదలతో సాధన చేశా. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సింగిల్, డబుల్ స్టిక్ విభాగాల్లో కాంస్య, ఫైట్ విభాగంలో వెండి పతకం సాధించా. మరింత శ్రద్ధగా సాధన చేసి.. బంగారు పతకాలు సాధిస్తామంటూ' బి.ఏంజెల్ దీమా వ్యక్తం చేస్తోంది.

ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు


అల్పాహార శాలలో తనిఖీ చేస్తున్న సంయుక్త కలెక్టర్

ఈనాడు కథనానికి స్పందన

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్పాహార, భోజనశాలల్లో ఆహార కల్తీపై 'రోగాలు అమ్ముతున్నారు' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి భీమవరం పట్టణంలోని అల్పాహారశాలలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అక్కడ ఆహార పదార్థాల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం మాంసం కూర, కారం నమూనాలు తీయించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపారు. కల్తీ జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కొన్ని హోటళ్లలో నిల్వ ఆహారాన్ని వడ్డిస్తున్నారని, రసాయన రంగులు వాడుతున్నట్లు తన దృష్టికొచ్చిందన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా ఆహార భద్రతాధికారి ఏఎస్ఆర్ రెడ్డి, సహాయ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న భారతీయ విద్యాభవన్స్ ప్రతినిధులు, విద్యార్థులు

వరద బాధితులకు విరాళాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితులకు భీమవరంలోని భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు రూ.15 లక్షల విరాళం సేకరించారు. సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు కలిసి ఈ చెక్కును సీఎం చంద్రబాబునాయుడుకు అమరావతిలో అందజేశారు. ఆనంద గ్రూప్స్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, జోగి వర్మ, కంతేటి వెంకట్రాజు, సామంతపూడి శ్రీరామరాజు, బుద్ధరాజు శివాజీరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ★ భీమవరం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ తరపున రూ. 3,01,116 విరాళాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు మంగళవారం అందజేశారు. భీమవరం స్టాకిస్ట్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధులు రూ. 25,116 విరాళం అందజేశారు.

27న విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

గునుపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను భీమవరం పారిశ్రామికవాడలో ఉన్న ఈఈ కార్యాలయంలో ఈ నెల 27న నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి వేదిక ఛైర్మన్ బి.సత్యనారాయణ (విశాఖపట్నం) అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

వైకాపా హయాంలో రైతులకు నష్టం: శ్రీనివాసవర్మ


డ్రోన్ పనితీరు పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

ఆచంట, న్యూస్‌టుడే : జగన్ ప్రభుత్వం రైతులకు బీమా ప్రీమియం చెల్లించకపోవడం వల్ల జిల్లాలో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయినా పరిహారం పొందలేకపోయారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విమర్శించారు. మంగళవారం ఆచంట మండలం కరుగోరుమిల్లిలో 'పొలం పిలుస్తోంది' సభలో మాట్లాడారు. రైతుల అభివృద్ధి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని వర్మ తెలిపారు. రైతులు ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవడానికి సాంకేతికత ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు వారానికి మూడు రోజులపాటు స్థానికంగా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు డ్రోన్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

రూ.297 కోట్లతో రహదారుల అభివృద్ధి: మంత్రి కొలుసు


సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పార్థసారథి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రహదారులను రూ. 297 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆగిరిపల్లి మండలం సగ్గూరు, కొమ్ముూరు, వట్టిగుడిపాడు గ్రామాల్లో రూ. 35.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేయడంతో పూర్తిగా ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారాయన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత రహదారి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.భవానీశంకరి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్‌మోషే, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు చూడాలని జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్.విజయభారతి ఆదేశించారు. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, భోజనశాలలు, వసతి సదుపాయం, పారిశుద్ధ్యం, తరగతుల నిర్వహణ అంశాలను పరిశీలించారు.

'టెట్' పరీక్షలకు రెండు కేంద్రాలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: 'ఉపాధ్యాయ అర్హత పరీక్షకు (టెట్) రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో ఎస్. అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో మొత్తం 5,670 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తారని అన్నారు. అక్టోబరు 3 నుంచి 21 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఈనెల 22న విడుదల చేశారన్నారు. http:/// cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులుంటే అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి పరీక్ష కేంద్రం వద్ద నామినల్ రోల్స్‌లో సరిచేయించుకోవచ్చన్నారు.

పెట్రోలు బంకులో విజిలెన్సు తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భీమవరం మండలం గూట్లపాడులోని ఓ పెట్రోలు బంకులో మంగళవారం రాత్రి విజిలెన్సు అధికారులు తనిఖీలు చేశారు. పెట్రో ఉత్పత్తుల నిల్వల్లో వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు. గాలి పెట్టే యంత్రం పని చేయకపోగా- సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా ఉన్నట్లు తేల్చారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయిల్ నమూనాలు సేకరించారు. విజిలెన్సు డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఆయిల్ నమూనాలు ప్రయోగశాలకు పంపుతామన్నారు. పెట్రోల్ బంక్ నిర్వహణ అధ్వానంగా ఉందని, దీనిపై చర్యలుంటాయని హెచ్చరించారు. విజిలెన్సు సీఐ పి.శివరామకృష్ణ, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ నాగరాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజూ విజయవాడలోనే వైద్యులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన విషయం విదితమే. మంగళవారం నిరసన కొనసాగించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలని వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు కోరారు. నగరంలో మంగళవారం నిర్వహించిన సంఘం ఏలూరు జోన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

పొంగిన వాగు.. కొట్టుకుపోయిన గొర్రెలు


రహదారిపై ప్రవహిస్తున్న వాగు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: మంగళవారం ఉదయం నుంచి ఉక్కబోత వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో నిమిషాల వ్యవధిలో జీలుగుమిల్లి సమీపంలోని వాగు పొంగి రహదారిపై ప్రవహించింది. ఆ సమయంలో అటుగా వస్తున్న తాటియాకులగూడేనికి చెందిన నలుగురు కాపరులు సమారు 260 గొర్రెలను నిలువరించలేకపోయారు. వాటిలో 28 కొట్టుకుపోతుంటే 18 గొర్రెలను కాపాడారు. వాగు ఉద్ధృతి మరింత పెరగడంతో మరో 10 కొట్టుకుపోయాయి. గంట వరకు వెతికినా ఆచూకీ కానరాలేదని బాధితుడు గొర్రిపాటి రాజు వాపోయాడు. కాగా రహదారిపై ప్రవహిస్తున్న వాగులో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కాలినడకన దాటారు.

అవయవదాతకు అశ్రు నివాళి


అంతిమయాత్రలో స్థానిక నాయకులు, గ్రామస్థులు

వీరవాసరం, న్యూస్‌టుడే: అవయవదానం చేసిన పోలిశెట్టి రేవంత్ శ్రీమురహరి అందరి హృదయాల్లో సజీవంగా నిలిచే ఉంటారని వీరవాసరం మండలానికి చెందిన పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కాకినాడ జిల్లా తుని మండలంలో జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రేవంత్ (19) జీవన్మృతుడు (బ్రెయిన్‌డెడ్) కావడంతో అతడి తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం, నాగపుష్ప దంపతులు కుమారుడి అవయవాలు దానం చేయడానికి ముందుకు వచ్చారు. సోమవారం రాత్రి వైద్య నిపుణులు రేవంత్ శరీరం నుంచి మూత్రపిండాలు, కాలేయం, ఇతర అవయవాలు వేరు చేసి అవసరమైన వారికి అమర్చేందుకు కాకినాడ, విశాఖపట్నం తరలించారు. మంగళవారం మధ్యాహ్నం రేవంత్ భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామమైన తోకలపూడి తీసుకువచ్చారు. అంబులెన్స్ వీరవాసరంలో ప్రవేశించగానే స్థానిక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, మహిళలు, స్థానికులు పెద్దఎత్తున రహదారికి ఇరువైపులా నిలుచొని పూలు చల్లుతూ.. రేవంత్ జోహార్ అంటూ నినదిస్తూ నివాళులర్పించారు. వీరవాసరం నుంచి తోకలపూడి వరకూ దారి పొడవునా ప్రజలు బారులు తీరి రేవంత్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలను మంగళవారం సాయంత్రం స్వగ్రామంలో పూర్తి చేశారు. జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు యాళ్లబండి ఇందిర, గుల్లిపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాయాలంటే ప్రయాసే..!

★ వీరవాసరం గ్రామానికి చెందిన అలేఖ్య టెట్ ఎ, బి పేపర్లకు దరఖాస్తు చేశారు. ఎ పరీక్షకు కాకినాడ, బి పరీక్షకు తిరువూరు కేంద్రాలకు కేటాయించారు. ఈ రెండు కేంద్రాలకు చేరుకోవాలంటే వంద కిలోమీటర్లకుపైగా ప్రయాణించాలి.

★ ఇదే గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి పేపర్- 1 పరీక్షకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కేంద్రాల్ని ఐచ్ఛికంగా నమోదు చేసుకోగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కేంద్రాన్ని కేటాయించారు. పేపర్- 2 తెలుగు పరీక్షకు విజయవాడ కేంద్రాన్ని కేటాయించారు.

సుదూరంగా కేంద్రాలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కేంద్రాలను వందల కిలోమీటర్ల దూరంలో కేటాయించడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో పరీక్ష కేంద్రాల కోసం వివిధ జిల్లాలను అభ్యర్థులు ఐచ్ఛికాలుగా ఎంపిక చేసుకున్నారు. కానీ ఎంచుకున్న ప్రాంతాలతో సంబంధం లేకుండా అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలను కేటాంచారు. అవి సుమారు వంద కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. ఇటీవల టెట్‌హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న పలువురు కేటాయించిన కేంద్రాలను చూసి కంగుతింటున్నారు.

మార్పు చేయాలని వేడుకోలు..

ప్రాధాన్య క్రమంలో మూడు జిల్లాల పరిధిలో కేంద్రాలను అభ్యర్థులు ఐచ్ఛికాలుగా ఎంపిక చేసుకోవాల్సి ఉంది. చాలా మందికి మూడో ప్రాధాన్యంగా ఎంచుకున్న జిల్లాలో కేంద్రాలను కేటాయించినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం వేళ రెండు విడతలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు వంద కిలోమీటర్లకు పైగా దూరం వెళ్తే తిరుగుప్రయాణంలో ఇబ్బందులు తప్పవని మహిళా అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పరీక్ష కేంద్రాలను మార్పు చేయాలని అధికారులను వేడుకొంటున్నారు.

గోదావరిలో దూకి భీమవరం వాసి గల్లంతు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు -రాజమహేంద్రవరం మధ్య రోడ్‌కం రైలు వంతెనపై నుంచి గోదావరిలో దూకి ఒకరు గల్లంతైన ఘటన కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి వంతెనపై 127వ స్తంభం వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి నదిలో దూకేశారు. సమాచారంతో పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. బండిపై భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ చిత్రం, జై గ్రంథి.. సిద్ధం అని రాసి ఉంది. వాహన సంఖ్య ఆధారంగా భీమవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. బండి ఆధారంగా ఆ పట్టణానికి చెందిన ఓ వ్యక్తిగా గుర్తించారు. కాగా ప్రస్తుతం ఆ వాహనం అతని దగ్గర కాకుండా వేరే వాళ్ల దగ్గర ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గల్లంతైన వ్యక్తిపై స్పష్టత రాలేదు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దీనిపై కేసు నమోదైంది.

ఏలూరుపాడులో 144 సెక్షన్

కాళ్ల (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు తెలిపారు. 14 రోజుల పాటు 144 సెక్షన్, 30 పోలీసు చట్టం అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని ఎస్సై ఎన్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు

కానరాని వైద్య విద్యార్థి ఆచూకీ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్ద గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. మూడో రోజైన మంగళవారం తెల్లవారుజాము నుంచే సహాయక బృందాలు గాలింపు ప్రారంభించాయి. అయితే రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు. మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్దకు ఆదివారం వచ్చిన ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన 14 మంది వైద్య విద్యార్థుల్లో ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర విపత్తుల సహాయక బృందాలు, అటవీశాఖ సిబ్బంది, సీబీఈటీ సభ్యులు అవిశ్రాంతంగా వాగులు, వంకల వెంబడి గాలిస్తూనే ఉన్నారు.


డ్రోన్లతో చేపట్టిన గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి

పాములేరు వెంబడి డ్రోన్లతో.. గాలింపు చర్యలను రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, అటవీశాఖ డీఎఫ్‌వో బబిత పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులుగా జలపాతం పరిసరాలను జల్లెడ పట్టినా ఫలితం లేకపోవడంతో వాగు ప్రవాహానికి సదరు విద్యార్థి పాములేరు వాగులోకి కొట్టుకుని పోయి ఉండవచ్చనే అనుమానంతో డ్రోన్లతో వాగు వెంబడి గాలిస్తున్నారు. ఆయా వాగుల వెంబడి ఉన్న కొండల ప్రాంతాలను నిశితంగా పరిశీలించడానికి ఏఎన్ఎస్ పార్టీలను వినియోగించనున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

చెరువులో మునిగి కూలీ మృతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: చెరువులో స్నానం చేసేందుకు దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై జి.వాసు కథనం మేరకు... తూర్పుతాళ్లు పంచాయతీ కోడివారిమెరకకు చెందిన పెమ్మాడి వీర్రాజు(33) ఈ నెల 23న కూలి పనికెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చారు. స్నానం చేసేందుకు చెరువులో దిగగా- ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగురాలు అయిన 15 ఏళ్ల బాలికపై 65 ఏళ్ల వృద్ధుడు లైంగిక దాడి చేయడంతో యువతి గర్భవతి అయిన ఘటన పాలకొల్లు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. 18వ వార్డుకు చెందిన వృద్ధుడు సుబ్బయ్య వరుసకు మనుమరాలైన దివ్యాంగురాలిపై గత కొంత కాలంగా లైంగిక దాడికి పాల్పడుతుండటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జరిగిన విషయం చెప్పుకోలేని ఆ యువతి ప్రస్తుతం 7వ నెల గర్భిణి. గతంలో ఆ వృద్ధుడు 8ఏళ్ల బాలికను లైంగికంగా వేధించి హత్య చేసిన నేరంపై యావజ్జీవ ఖైదీగా జైలుకు వెళ్లి తిరిగి వచ్చిన చరిత్ర ఉందని చెబుతున్నారు.

ముఖ్యమంత్రిపై అసభ్యకర పోస్టులు నిందితుడి అరెస్టు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై అసభ్యకరంగా, దూషణలతో కూడిన పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక తెదేపా నాయకుడి ఫిర్యాదు మేరకు అతడిపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆగస్టు నెలలో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా హీరాపూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి, మంగళవారం అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం తీసుకొచ్చారు. స్థానిక కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.50 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

• భీమవరం • ఉండి

పొగాకు వినియోగంతో అనర్థాలు



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్పీ, వైద్యశాఖ అధికారులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పొగాకు వినియోగంతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించేలా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రాలను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొగాకు వినియోగంతో తీవ్ర రుగ్మతలు తప్పవన్నారు. మత్తు పదార్థాలు, గంజాయికి యువత దూరంగా ఉండేలా విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారిణి సీహెచ్ ధనలక్ష్మి, పాల్గొన్నారు.



జిల్లా జట్లకు ఎంపికైన పాఠశాల విద్యార్థులు

సత్తా చాటిన మోగల్లు విద్యార్థులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: క్రీడా పోటీల్లో మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపి 35 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో జిల్లా జట్లకు ఎంపికయ్యారు. గేమ్స్‌లో 21 మంది, అథ్లెటిక్స్‌లో 14 మంది, వాలీబాల్, కబడ్డీ, చదరంగంలో ఇద్దరేసి, ఖోఖోలో 10 మంది, షటిల్ బాడ్మింటన్‌లో అయిదుగురు ఎంపికయ్యారు. పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్ విభాగాల్లో 14 మంది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు త్రినాథ్ తెలిపారు. నియోజకవర్గ జట్టుకు ఎంపికైన విద్యార్థులకు మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, క్రీడల నిర్వహణ దాత కలిదిండి సందీప్‌వర్మ, వనుం వెంకటేశ్, పీడీ రాంబాబు తదితరులు విద్యార్థులను అభినందించారు.

స్వర్ణాంధ్ర సాధనపై అవగాహన

కాళ్ల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర- 2047 అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కార్యక్రమాన్ని కాళ్ల మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో జి. స్వాతి దీనికి సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామ పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని మండల అధికారులను ఆదేశించారు. పేదల గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.



ప్రచార పత్రాలతో అధికారులు

నిఘాతో నేరాల నియంత్రణ



దస్త్రాలు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండలంలో చోరీలు, నేరాలను కట్టడి చేసేందుకు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు సూచించారు. ఇటీవల బదిలీపై భీమవరం సీఐగా వచ్చిన ఆయన వీరవాసరం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గస్తీ నిర్వహించాలని ఎస్సై కృష్ణాజీకి సూచించారు. మత్తుపదార్థాల వినియోగంతో తలెత్తే అనర్థాలపై విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

కలుషిత జలాలే దిక్కు!

నిర్వహణ లేమితో గ్రామీణులకు కష్టాలు



✷ భీమవరం మండలం గూట్లపాడులో తాగునీటి చెరువులో జలాలు ఇలా రంగు మారి, పసర్లు తేలి భయంగొలిపేలా కనిపిస్తున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ గ్రామ ప్రజలు ఈ నెల 23న 'మీ కోసం' కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.



✷ భీమవరం మండలం కొత్తపూసలమూరు పంచాయతీలోని ఫిల్టర్ బెడ్ ఇది. నీరు పచ్చని రంగులో పసర్లు తేలింది. నిత్యం మండల స్థాయి అధికారులు రాకపోకలు సాగించే భీమవరం- దొంగపిండి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ ఫిల్టర్‌బెడ్ నిర్వహణను పట్టించుకొనే నాథులే లేరని స్థానికులు వాపోతున్నారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామంటూ ప్రచారంతో ఊదరగొట్టిన గత పాలకులు గ్రామాల్లో తాగునీటి వనరుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. అధిక శాతం గ్రామాల్లో కనీసం ఫిల్టర్‌బెడ్‌లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. భీమవరం మండలం గూట్లపాడు పంచాయతీలో గత అయిదేళ్లుగా ఫిల్టర్ బెడ్ల ప్రమేయం లేకుండా నేరుగా నీటిని సరఫరా చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ మండలంలో 25 పంచాయతీలు ఉండగా దాదాపు 15 గ్రామాల్లో ఇదే పరిస్థితి. వీరవాసరం మండలంలో 23 పంచాయతీలకు గాను 6 గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉంది. మరో ఎనిమిది గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి.

రోగాల బారిన పడుతున్నాం..

నాలుగేళ్లుగా మంచి నీటి చెరువు నిర్వహణను గాలికొదిలేశారు. శుద్ధి చేయకుండా నేరుగా కాలువ నీటిని చెరువులో నింపి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. కలుషిత జలాలతో ఎంతో మంది రోగాల బారిన పడ్డారు. జల్‌జీవన్ మిషన్ నిధులు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా తీర ప్రభావిత గ్రామాలకు ఆ ఫలాలు అందడం లేదు. కొత్త ప్రభుత్వం స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాం.

- జల్లా వెంకటేశ్వరరావు, కొత్తపూసలమూరు

పరిష్కారానికి చర్యలు

కొత్తపూసలమూరులో ఫిల్టర్‌బెడ్ సమస్య ఉంది. గూట్లపాడు గ్రామంలో పనులకు నిధులొచ్చాయి. టెండర్లు ఖరారు కావాల్సి ఉంది. సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో సూక్ష్మ ఫిల్టర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. **- కనకారావు, జేఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం**

తెదేపా శ్రేణుల సంబరాలు



వేడుకలో పాల్గొన్న నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజును ఏపీఐఐసీ ఛైర్మన్‌గా ఎంపిక చేయడంపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆకివీడులోని తెదేపా కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ ఆధ్వర్యంలో శ్రేణులు కేకు కోసి మిఠాయిలు పంచారు. కాళింగగూడెం తదితర గ్రామాల్లోను నాయకులు సంబరాలు నిర్వహించారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: గొల్లలకోడేరుకు చెందిన తెదేపా సీనియర్ నాయకులు కమ్మిల రాంబాబు, కామన రాంబాబు, శలా మల్లేశ్వరరావు తదితరులు మంతెన రామరాజుకు అభినందనలు తెలిపారు.

దాసాంజనేయస్వామికి అభిషేకాలు



భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : భాద్రపదమాస మంగళవారం సందర్భంగా భీమవరం కొత్త బస్టాండ్ సమీపాన ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామిని తమలపాకులు, వివిధ రకాల పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించి సహస్ర నామ పూజలు చేసినట్లు అర్చకుడు ఘంటసాల పవన్‌శర్మ తెలిపారు.

చిన్నారులకు గుండె పరీక్షలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరంలో పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో వసుధ ఫౌండేషన్ సహకారంతో అల్లూరి సీతారామ రాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు గుండె పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు విక్రమ్ చిన్నారులకు ఉచితంగా 2డీ ఎకో పరీక్షలు చేశారని ట్రస్ట్ ఛైర్మన్ బి. బలరాం తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా ఇప్పటి వరకు 50 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు చేయించినట్లు తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదు

విస్సాకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: భాజపా మహా సంపర్క అభియాన్‌లో భాగంగా మంగళవారం విస్సాకోడేరులో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల ఇన్‌ఛార్జి ఇంజేటి వెంకటేశ్వర్లు తెలిపారు. నాయకులు ప్రసాదం ఏడుకొండలు, చెన్నంశెట్టి నాగరాజు, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న రామాంజనేయులు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం మండలం నాగిడిపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని' మంగళవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి- సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా పారదర్శక పాలన అందించడమే లక్ష్యమని తెలిపారు. తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ, ఎంపీటీసీ సభ్యురాలు నాగిడి మహాలక్ష్మి, సర్పంచి దుర్గాభవాని, ఏఎంసీ మాజీ ఛైర్మన్ యిందుకూరి రామలింగరాజు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కవురు పృథ్వీశంకర్, బొడ్డు మోహన్, జనసేన పట్టణాధ్యక్షుడు చనమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మత్స్యపురిలో.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

కల్తీ నెయ్యి బాధ్యులను వదలొద్దు



ప్రదర్శనలో పాల్గొన్న రామరాజు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: తిరుమలలో మహా ప్రసాదం పవిత్రతను మంటకలిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు, కూటమి నాయకులు కోరారు. ఆకివీడు పరిధి మాదివాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గోపూజ, శాంతి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద నుంచి గాంధీ విగ్రహం కూడలి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తిరుమలలో కల్తీ నెయ్యి బాధ్యులు ఎంతటి వారైనా వదలొద్దంటూ నినాదాలు చేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జులు జుత్తిగ నాగరాజు, కోరా రామ్మూర్తి, తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ధర్మ పరిరక్షణ.. గునుపూడి, న్యూస్‌టుడే: ఆలయాల పరిరక్షణకు హిందువులంతా ఏకం కావాలని హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు గన్నాబత్తుల శ్రీనివాస్, కొటికలపూడి ఫణిబాబు, దాట్ల రంగరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, వడుపు గోపి పిలుపునిచ్చారు. పట్టణంలోని వెంకట్రామ థియేటర్ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

'కుల రాజకీయాలు సరికాదు'

కాళ్ల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైకాపా పాలకులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు పక్కదోవ పట్టించేందుకే ఆ పార్టీ నాయకులు ఏలూరుపాడు ఘటన పేరిట కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని కూటమి నాయకులు విమర్శించారు. జువ్వలపాలెం గ్రామంలో కూటమి నాయకులు, దళిత నాయకులు కలిసి మంగళవార విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజుకు మద్దతుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు ఆకివీడులో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఏలూరుపాడు ఘటనపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై నాగరాజుకు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణల పర్వానికి తెర!



రహదారి వెంబడి సర్వే చేస్తున్న అధికారులు

గొల్లలకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: పల్లెల్లో రహదారుల వెంబడి ఆక్రమణల పర్వానికి ఇక తెరపడనుంది. గొల్లలకోడేరు పరిధిలో ప్రధాన రహదారి ఇరువైపులా ఆక్రమణల తొలగింపునకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఆర్‌అండ్‌బీ రహదారిలో సంజన ఎస్టేట్ నుంచి గరగపర్రు సరిహద్దు వరకు ప్రభుత్వ, పోరంబోకు స్థలాలు భారీగా ఆక్రమణలకు గురయ్యాయి. ప్రధాన కూడలిలో రహదారికి ఇరువైపులా దుకాణాలు, ఇతర నిర్మాణాలు వెలిశాయి. దుకాణాల వద్ద వాహనాలను రహదారిపై నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మంగళవారం సర్వే మొదలు పెట్టారు. రహదారి ఇరువైపులా విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. ప్రస్తుతం సర్వే చేసి మార్కింగ్ ఇస్తున్నామని, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

గత అయిదేళ్లలోనే ఎక్కువ

గత అయిదేళ్లలో వైకాపా హయాంలో ఆక్రమణలు భారీగా పెరిగాయి. ఆర్‌అండ్‌బీ స్థలంతో పాటు జలవనరుల శాఖ స్థలాన్ని సైతం ఆక్రమించి దుకాణాలు, భవనాలు నిర్మించారు. సంజన ఎస్టేట్ సమీపాన పలు లేఅవుట్లలోకి ప్రభుత్వ స్థలాలను కలిపేశారు. ప్రధాన కూడలిలో పంచాయతీ కార్యాలయానికి వెళ్లే మలుపు వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. యనమదుర్రు వంతెన సమీపాన కూడా ఇటీవల కొందరు ప్రభుత్వ స్థలాలను మెరకచేసి నిర్మాణాలు చేపట్టారు.

వరికి తెగుళ్ల బెడద

పాలకోడేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరి పంటలో తెగుళ్ల బెడద అధికంగా ఉందని, రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త మల్లికార్జునరావు సూచించారు. కొండేపూడిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్, వ్యవసాయాధికారి వి.నారాయణరావు క్షేత్ర పరిశీలన చేసి రైతులకు సూచనలు చేశారు. స్వర్ణ రకాల్లో దోమ ఉద్ధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందుల గురించి రైతులకు వివరించారు.

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: పెదఅమిరంలో వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం అధికారిణి జి.బాలనాగేశ్వరమ్మ మంగళవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వరిలో ఆకుఎండు, ఆకు ముడత తెగుళ్ల వ్యాప్తిని సస్యరక్షణ చర్యలతో అరికట్టవచ్చన్నారు. పొలంలోని నీటిని బయటకు మళ్లించి కొత్త నీటిని పెట్టుకోవాలని, నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25న రైతు సేవా కేంద్రాల్లో ఎరమందును పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం.. భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. భీమవరం మండలం రాయలంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నాయకులు కోళ్ల అబ్బులు, దండు సోమరాజు పాల్గొన్నారు.

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: కొణితివాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్ క్షేత్ర స్థాయిలో వరి చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	మత్తువదలరా 2
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సరిపోదా శనివారం
నటరాజ్	100 క్రోర్స్
కిషోర్ స్క్రీన్ 1	జర్నీ, బొమ్మరిల్లు
కిషోర్ స్క్రీన్ 2	చిక్లెట్స్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	మన్యం ధీరుడు
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	మత్తువదలరా 2
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	సరిపోదా శనివారం
విజయలక్ష్మి స్క్రీన్ 1	గొర్రె పురాణం
మహాలక్ష్మి స్క్రీన్ 2	మనం

చంపుతానని బెదిరింపులు

ఉండి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో అయిదుగురు వ్యక్తులు చంపుతానని బెదిరించినట్లు చెరుకువాడ గ్రామానికి చెందిన కొండవీవటి నాగవెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఉండిలో ఓ స్థలం విషయంలో తనను దంతులూరి రామకృష్ణంరాజు, మరో నలుగురు తరచూ తనని పిలిచి బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

పాలకోడేరు, న్యూస్‌టుడే: విస్సాకోడేరులో ఓ బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎన్.హరిబాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిందితుడు కొంత కాలం నుంచి ప్రేమ పేరిట ఆ బాలిక వెంట పడుతున్నాడు. ఇటీవల ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆభరణాల దుకాణంలో తనిఖీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని పొట్టి శ్రీరాములు కూడలిలో ఉన్న ఆభరణాల దుకాణంలో మంగళవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేశారు. చోరీ కేసు నిందితుడు ఇటీవల భీమవరం పోలీసులకు పట్టుబడ్డాడు. చోరీ సొత్తు విక్రయాలకు సంబంధించి అతడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా భీమవరం పోలీసులతో పాటు ఆకివీడు ఎస్సై నాగరాజు, సిబ్బంది ఆ దుకాణంలో తనిఖీలు చేశారు.

అవి ఇవి అన్నీ

ఉద్యోగ భద్రత కల్పించండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నాయకులు శివకుమార్, క్రాంతి, దుర్గారావు తదితరులు కోరారు. మహదేవపట్నం రోడ్డులోని మద్యం డిపో వద్దకు మంగళవారం ప్రదర్శనగా వెళ్లి సీఐ పద్మజకు వినతిపత్రం ఇచ్చారు.

దేవుని మార్గంలో పయనిద్దాం

ఉండి, న్యూస్‌టుడే: దేవుని మార్గంలో విశ్వాసులంతా పయనించేలా పాస్టర్లు కృషి చేయాలని ఐక్య పాస్టర్ల సంఘం (యూపీఏ) జిల్లా నాయకులు అన్నారు. ఆ సంఘం మండల కార్యవర్గం ఎన్నికను ఉండిలోని వాగ్ధాన ప్రార్థన మందిరంలో మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి మెల్కిసెదక్, ఉపాధ్యక్షుడిగా మాదాసి రవికుమార్, కార్యదర్శిగా మాకా ఇమ్మానియేలు, కోశాధికారిగా వైజె ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా కె.ప్రసాద్ పాల్ ఎన్నికయ్యారు.

ఎంపీడీవో బదిలీ

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ఎంపీడీవో కె.వాణి ఏలూరు జిల్లా లింగపాలెం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్తు కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఆమెను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆకివీడు ఈవోపీఆర్డీ కేవీ సుబ్బారావుకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

గడువు ఇవ్వాలని వినతి

ఆకివీడు, న్యూస్‌టుడే: అయిభీమవరం గ్రామ పరిధిలో వెంకయ్యవయ్యేరు కాలువ గట్టు వెంబడి ఉన్న నివాసాలను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించిన నేపథ్యంలో తమకు ఆరు నెలల గడువు ఇవ్వాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ఈ అంశంపై మంగళవారం సీపీఎం నాయకులతో కలిసి ఆకివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డీటీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు.

లక్ష్యంతో చదివితే ఉన్నతి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని నరసాపురం డీఎస్పీ ఎన్.బి.ఎం.మురళీకృష్ణ అన్నారు. స్థానిక డీఎన్ఆర్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

చినకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆకివీడు పట్టణంలో, మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చినకాపవరం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది స్థానిక ఉన్నత పాఠశాల ప్రాగణాన్ని, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని బ్యాంకు మేనేజర్ డి.శ్యామ్ విద్యార్థులకు వివరించారు.

ప్రజా చైతన్యంతో పర్యావరణ పరిరక్షణ.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా చైతన్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలిథిన్ వ్యర్థాల వల్ల తలెత్తే అనర్థాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తే మార్పు తప్పకుండా వస్తుందన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు బహుమతులు అందజేశారు.

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

వరద గాయానికి చిరు సాయం!



యలమంచిలి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి యలమంచిలి మండలం కట్టుకాల్వ యూపీ పాఠశాల విద్యార్థులు తమవంతు సాయం అందించారు. తల్లిదండ్రులతోపాటు స్థానిక వ్యాపారుల నుంచి మంగళవారం వరద బాధితుల సహాయార్థం రూ. 25 వేలు విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు గోటేటి బుజ్జి ద్వారా జిల్లా విద్యాశాఖాధికారికి పంపించారు.

శ్మశాన వాటికలో చెత్త తొలగింపు



పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం శ్మశాన వాటిక పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు రోజుల కిందట ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శ్మశాన వాటిక పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు తొలగించే పనులు ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. సిద్ధాంతం సర్పంచి సీహెచ్ గనిరాజు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: స్థానిక 6వ వార్డు షావుకారుపేటలో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు చెప్పగా ఈ నెల 24వ తేదీన ప్రచురితమైంది. దీనిపై పురపాలక ఏఈ సతీశ్ స్పందించి మంగళవారం మరమ్మతులు చేయించారు.

హమ్మయ్య.. మంచినీరొచ్చింది!



పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు బ్రాడీపేట బైపాస్‌లో ఉన్న గురుకుల పాఠశాల వసతిగృహానికి మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'వసతి గృహాన.. అవస్థలే అడుగడుగునా' శీర్షికన ఈనాడులో మంగళవారం ప్రచురితమైన కథనానికి పురపాలిక అధికారులు స్పందించారు. కమిషనర్ విజయసారథి ఆదేశాల మేరకు పురపాలిక సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేయడంతో వసతిగృహానికి మంచినీటి సరఫరా పునఃప్రారంభమైంది.

ఈనాడు కథనానికి స్పందన

ఎటు వెళ్లినా ఇరుక్కుపోవడమే!

పాలకొల్లులో తీరని ట్రాఫిక్ కష్టాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:

ఎనిమిది మండలాలకు వాణిజ్య కేంద్రం పాలకొల్లు పట్టణానికి రోజూ పది వేల మందికి పైగా జనం వివిధ అవసరాలకు వస్తుంటారు. సుమారు ఎనిమిది వేలకు పైగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, చిరువ్యాపారుల బండ్లు, ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. దీనికి తోడు వ్యాపార సంస్థలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ప్రధానంగా మహాత్మాగాంధీ రోడ్డు, బుధవారపువీధి, సుబ్బారాయుడుగుడి సెంటర్, మారుతీ సెంటర్, కోర్టు ప్రాంగణం, ఎన్టీఆర్ కళాక్షేత్రం, బస్టాండ్, రైల్వే గేటు, దేశాలమ్మ ఆలయాల వద్ద వ్యాపార సంస్థల ముందు నిలుపుతున్న వాహనాలు రహదారులపైకి రావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే సమయంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు పట్టణంలో బస్టాండ్, రైల్వే స్టేషన్లకు వెళ్లే ప్రయాణికులు ప్రధాన కూడలిలో నరకం కనిపిస్తుందని ఆవేదన చెందుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు.. పాలకొల్లు నుంచి దొడ్డిపట్ల వెళ్లే వాహనాలు బస్టాండ్ నుంచి సుబ్బారాయుడుగుడి సెంటర్ మీదుగా వెళ్తాయి. ఇరుకుగా ఉండే ఈ దారిలో వాహనాల రాకపోకలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇరుకు వీధుల్లో ఉన్న దుకాణాలకు సరకుల దిగుమతి చేయడానికి సమయపాలన లేకపోవడం కూడా సమస్యకు కారణం అవుతోంది. వ్యాపార సంస్థలకు సంబంధించిన బోర్డులను కూడా రోడ్లపైకి తీసుకురావడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.



రద్దీగా మహాత్మాగాంధీ ప్రధాన రహదారి



బుధవారపు వీధి నుంచి సుబ్బారాయుడు గుడికి వెళ్లే మార్గంలో నిలిచిన వాహనాలు

ఆక్రమణలతో.. పురపాలక, వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిర్మించిన దుకాణాలు పలు వ్యాపార సంస్థలకు అద్దెలకు ఇచ్చారు. అద్దెకు తీసుకున్న ప్రదేశాన్ని కాకుండా కొంతమేర రహదారిని ఆక్రమించి వ్యాపారాలను కొనసాగిస్తుండటంతో పార్కింగ్ సమస్య ఏర్పడింది. డ్రెయిన్లను సైతం ఆక్రమించడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితిపై పట్టణ సీఐ కె.రజనీకుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడానికి పురపాలక అధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి త్వరలోనే అమల్లోకి తెస్తామన్నారు.



వేంకటేశ్వరస్వామికి సహస్ర దీపారాధన

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడంపై వేంకటేశ్వరస్వామిని క్షమించమని వేడుకుంటూ పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి, హిందూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సహస్ర దీపారాధన చేశారు. మహిళలు దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం పఠనం చేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి సుమారు రెండున్నర గంటలు సరఫరా నిలిచిపోయింది. దాంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జిల్లాస్థాయి యోగం కోసం!

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పాలకొల్లు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు మేడపాడులో మంగళవారం జరిగాయి. యోగా, చదరంగం, వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి ఎంపికలు చేపట్టారు. దీనిలో యోగాసనాలు వేయడానికి బాలబాలికలు ఇలా శ్రమించారు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

లక్ష్యంతో చదివితేనే ఉన్నత స్థితి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని నరసాపురం డీఎస్పీ ఎస్.బి.ఎం. మురళీకృష్ణ అన్నారు. స్థానిక డీఎన్ఆర్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ సీఐ కె.రజనికుమార్, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శోభారాణి, మహిళ పోలీసు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

నచ్చిన మిల్లుకు ధాన్యం ఎగుమతి: పితాని

పోడూరు, మార్టేరు, పెనుగొండ, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయించే రైతులు తమకు నచ్చిన రైస్‌మిల్లుకు ఎగుమతి చేసుకునే అవకాశాన్ని ఎన్డీయే ప్రభుత్వం కల్పించిందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. గుమ్ములూరులో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని మాట్లాడారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. అనంతరం డ్రోన్ సాయంతో పొలాల్లో క్రిమి సంహారక మందుల పిచికారీని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట సమస్యలు తెలుసుకున్నారు. వెలగలేరులో ఏడీఏ హరిప్రసాద్ క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. పెనుగొండ, వడలి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల వ్యవసాయాధికారిణి స్పందన మాట్లాడారు.

పాలకొల్లు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చాక సాగులోను సాంకేతికతను పరుగులు పెట్టించడానికి ప్రయత్నిస్తుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఐదేళ్ల తర్వాత మళ్లీ మంగళవారం ప్రారంభమైంది. పాలకొల్లు నియోజకవర్గంలో తొలుత యలమంచిలి మండలం గుంపర్రు, దొడ్డిపట్లలో వ్యవసాయాధికారులు, రైతులు దీనిలో పాల్గొన్నారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గొంది గ్రామంలో మంగళవారం నుంచి చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొని మాట్లాడారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఏడీఏ అనిల్ కుమారి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ పనితీరును తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రమాదకరంగా నరసాపురం- మత్స్యపురి రహదారి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం వయా మత్స్యపురి భీమవరం ప్రధాన రహదారి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేయడంతో ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యింది. ఈ మార్గంలో నరసాపురం, వీరవాసరం, భీమవరం మండలాలకు చెందిన 20 గ్రామాల ప్రజలు, వాహన చోదకులు, ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు పలు చోట్ల గుంతలతో నిండిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింతగా పాడవడంతో ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై రహదారులు, భవనాలశాఖ నరసాపురం డీఈ జీవీఎస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.10 లక్షలతో అంచనాలు ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.



మల్లవరం పెదలంకకు వెళ్లే రోడ్డు వద్ద..



లిఖితపూడి సుబ్బారాయుడు గుడి సమీపంలో..

సమష్టి కృషితో సమగ్ర ప్రగతి

ఆచంట, పెనుగొండ గ్రామీణ, మార్టేరు, పోడూరు: న్యూస్‌టుడే : సమష్టి కృషితోనే సమగ్ర ప్రగతి సాధ్యమని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. కరుగోరుమిల్లిలో మంగళవారం శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నాని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గ్రామంలో గ్లోబల్ ఎన్జీవీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం 'పొలం పిలుస్తోంది'లో భాగంగా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన స్టాల్ పరిశీలించారు. పెనుగొండ మండలం దేవ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. నెగ్గిపూడిలో జనసేన మండలాధ్యక్షుడు కోయ వెంకట కార్తిక్ మాట్లాడారు... కేతవరం పోడూరు మండలాల్లో ఎన్డీయే ప్రభుత్వ పథకాలను వివరించారు.

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు 22, 23, 24, 25 వార్డులకు సంబంధించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. పురపాలిక కమిషనర్ విజయసారథి, నాయకులు గండేటి వెంకటేశ్వర్లు, పెశ్చెటి బాబు, రోజారమణి, గౌరునాయుడు పాల్గొన్నారు.

చినుకు పడితే ఇంతే..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో మంగళవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి పాలకొల్లు - భీమవరం ప్రధాన రహదారిపై నీరు చేరింది. వర్షం పడితే చాలు ఎప్పుడూ నీరు నిలిచిపోతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రైలు గేటు పడిన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో రహదారిపై నీరు నిలిచిపోవడంతో భక్తులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీ రహదారుల్లో గోతుల్లో నీరు చేరి, రాకపోకలకు అవస్థలు పడ్డారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయ ఆవరణలో వర్షపునీరు నిలిచిపోవడంతో ఉద్యోగులు, గ్రామస్థులు రాక పోకలు సాగించడం కష్టంగా మారింది.



వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో నిలిచిన వర్షపునీరు



పెనుగొండ ఉప ఖజానా కార్యాలయం ఆవరణలో

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఈఈ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీడీవో వీరభద్రరావు, ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ, గృహ నిర్మాణశాఖ ఏఈఈ రవీంద్ర, సహాయ గణాంకాధికారి దుర్గాసాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఈ వెంకటేశ్వరరావు

ముంపు సమస్య పరిష్కారానికి కృషి : శ్రీనివాసవర్మ

మొగల్తూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:

నరసాపురం నియోజకవర్గంలో కాలువల ప్రక్షాళనకు సహకారం అందించాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ విజ్ఞప్తి చేశారు. సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సహాయ మంత్రి శ్రీనివాసవర్మతో ఎమ్మెల్యే నాయకర్ భేటీ అయ్యారు. పలు సమస్యలపై చర్చించారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దీనిపై శ్రీనివాసవర్మ సానుకూలంగా స్పందించారు. • అంతకు ముందు స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీనివాసవర్మ భాజపా, నాయకులు కార్యకర్తలతో భేటీ అయ్యారు.

• అయిదేళ్ల సైకోపాలనలో బలైన రాష్ట్రం కూటమి ప్రభుత్వ విధానాలతో అభివృద్ధి వైపు పయనిస్తుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శేరేపాలెంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సర్పంచి తణుకుల మునేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, నిధులు మంజూరుకు ఎమ్మెల్యే నాయకర్‌కు తాను పూర్తి సహకారం అందిస్తానన్నారు. నరసాపురం- మచిలీపట్నం రైల్వేలైను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో బిడ్డలా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ముత్యాలపల్లిలో కూటమి నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంచిపెట్టారు.



సమస్యలపై చర్చిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే నాయకర్

ఎంపీడీవోగా త్రిశూలపాణి



మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు ఎంపీడీవోగా సీహెచ్ త్రిశూలపాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన యు.బాబ్జి రాజు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యలమంచిలి నుంచి త్రిశూలపాణి ఇక్కడకొచ్చారు.

వెలగని వీధి దీపాలు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో గత కొన్ని రోజులుగా అంధకారం నెలకొంది. పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. ప్రధాన రహదారులు, గోదావరి తీరం, మిషన్‌హైస్కూలు రోడ్డు, రుస్తుంబాద తదితర ప్రధాన మార్గాలు, అంతర్గత దారుల్లో ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. గత కొన్ని నెలలుగా వీటికి సక్రమంగా మరమ్మతులు చేయడం లేదు. దీంతో రాత్రి సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రి సమయంలో పాముల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సమస్యను 'న్యూస్‌టుడే' పురపాలక కమిషనర్ అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపడతానని చెప్పారు.



గోదావరి తీరంలో ఇలా..

ఆభరణాల దుకాణంలో తనిఖీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని పొట్టి శ్రీరాములు కూడలిలో ఉన్న ఆభరణాల దుకాణంలో మంగళవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేశారు. చోరీ కేసు నిందితుడి ఇటీవల భీమవరం పోలీసులకు పట్టుబడ్డాడు. చోరీ సొత్తు విక్రయాలకు సంబంధించి అతడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడిపై పోక్సో కేసు

పాలకోడేరు, న్యూస్‌టుడే: విస్సాకోడేరులో ఓ బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎన్.హరిబాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిందితుడు కొంత కాలం నుంచి ప్రేమ పేరిట ఆ బాలిక వెంట పడుతున్నాడు. ఇటీవల ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వారపుసంతలో బరకాలు కట్టుకున్న వ్యాపారులు

డేరాల సంత.. ఎన్నాళ్లీ చింత!

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులో ప్రతి శనివారం జరిగే సంత అంటే చుట్టుపక్కల 100 గ్రామాలకు ముఖ్యమైనది. కూరగాయల నుంచి నిత్యావసరాల వరకు ఇక్కడ లభించనిది ఏది ఉండదు. ఆచంట, నరసాపురం నియోజకవర్గాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి వ్యాపారం సాగిస్తుంటారు. వినియోగదారులు సైతం వేలాదిగా వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సంత మార్కెట్‌కు పురపాలికశాఖ కనీసం ప్రాధాన్యం ఇవ్వడం లేదనే ఆవేదన వ్యక్తమవుతుంది. ప్రతివారం క్రమం తప్పకుండా పన్నులు వసూలు చేసే అధికారులు వ్యాపారులకు కనీస ఏర్పాట్లు చేయడం లేదని వాపోతున్నారు. ఎండకు ఎండి వర్షానికి తడిసి వ్యాపారం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. చేసేదేంలేక ఇదిగో ఇలా ప్రతి వ్యాపారి బరకాలు డేరాలుగా చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. దీనివల్ల వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నాణేల ప్రదర్శన ముగింపు సభ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: యూత్‌హాస్టల్స్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ సామాజిక భవనంలో రెండు రోజుల పాటు స్టాంపులు మరియు నాణేల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపు సభ సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా చెన్నైకి చెందిన నాణేల పరిశోధకుడు రావినూతల సాయిశ్రవణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న సభ్యులందరిని సత్కరించారు.

ఎన్ఎస్ఎస్‌తో క్రమశిక్షణ

నరసాపురం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. స్థానిక వైఎన్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, విశ్రాంత శాస్త్రవేత్త ఆర్వీ సుబ్బారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పోడూరు మండలం జిన్నూరుకు చెందిన వాకపల్లి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండటంతో పాలకొల్లు యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఆచంట, న్యూస్‌టుడే : ఆచంట మండలం వల్లూరు ఎంపీ పాలెం పాఠశాల విద్యార్థి ధనుషా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. ఆమె కుటుంబానికి ఏలూరుకు చెందిన శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ మంగళవారం రూ.10వేలు సాయం అందించింది. జుత్తిగ ఈశ్వరి రూ.2వేలు, ఏడిద దుర్గా శ్రీనివాస్ రూ.2వేలు, ఏఆర్వీ ప్రసాదరావు రూ.వెయ్యి చొప్పున బాలిక తండ్రి శ్రీనివాస్‌కి అందించారు.

ముగిసిన శిక్షణ.. పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యవస్థాపకత అభివృద్ధి శిక్షణ తరగతులను స్థానిక డీఎన్ఆర్ మహిళా కళాశాలలో అయిదు రోజులుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం తరగతుల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధానోపాధ్యాయిని శోభారాణి మాట్లాడారు. 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చినట్లు ఐఎల్‌వో నిర్వహకుడు హేమాద్రి తెలిపారు. శిక్షణ పూర్తయిన మహిళలకు శిక్షణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సి.రవిశంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ సాధిద్దాం.. పెనుగొండ, న్యూస్‌టుడే:

అవి ఇవి అన్నీ

స్వచ్ఛ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సర్పంచి కాసాని విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వడలి పంచాయతీ ఆవరణలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. వ్యవసాయాధికారిణి పి.స్పందన, మాజీ సర్పంచి అంగర వరప్రసాద్, ఉప సర్పంచి వి.నరేష్, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం.. నరసాపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో మంగళవారం రెండో రోజు వైద్యశిబిరం కొనసాగింది. 'స్వచ్ఛత హీ సేవ'లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా వైద్య సేవలు చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుప్రియ, వైద్యులు జాన్‌హారిసన్ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: కట్నం తేవాలంటూ భార్యను వేధిస్తున్న భర్తపై మంగళవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఆయన కథనం మేరకు... పట్టణంలోని శారదా థియేటర్ ప్రాంతానికి చెందిన మోపిదేవి జ్యోతిమాణిక్యం, పొన్నపల్లికి చెందిన శ్రీనివాస్ నవ వధూవరులు. ఈ క్రమంలో పుట్టింటి నుంచి కట్నం తేవాలంటూ భర్త వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎలుకల నిర్మూలనతో ప్రయోజనం.. మొగల్తూరు, న్యూస్‌టుడే: ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టడంతోనే ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీం అన్నారు. మొగల్తూరు రైతు క్షేత్రాల్లో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొరియల గుర్తించారు. జడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎలుక బొరియలు గుర్తిస్తున్న రైతులు, అధికారులు

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు అడ్డాల పార్వతి అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు, అరట్లకట్ల గ్రామాల్లో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయ అధికారి రాజశేఖర్, సర్పంచి చొప్పల రజిని, రైతు సంఘ అధ్యక్షులు నెక్కంటి ఆదినారయణ, రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ప్రమాదాలు జరగవా...?

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: పలు కూడళ్లలో డ్రెయిన్లపై ఏర్పాటు చేసిన జాలీలు కుంగిపోయి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. స్థానిక శ్రీరాంపేటలో రహదారి మధ్యలో డ్రెయిన్‌పై ఉన్న ఇనుప జాలీ కుంగిపోయి రాత్రి సమయాల్లో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితిని మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి దృష్టికి తీసుకెళ్లగా చాలా కాలం కిందట వేసిన కొన్ని ఇనుపజాలీలు కుంగిపోతున్నాయన్నారు. అటువంటి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న భీమారావు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మంగళవారం అత్తిలి రిక్షా స్టాండు వద్ద కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొద్దాని నాగరాజు, బి.అప్పలస్వామి, జక్కుల ప్రసాద్, పెంటయ్య, నరసింహమూర్తి, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని రెల్లికాలనీలో శ్రీబాల కనకదుర్గ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ధనాల వెంకట్రావు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రపంచ నదుల దినోత్సవం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్,న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ నదుల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 19వ ఆంధ్రా బెటాలియన్ కమాండ్ అధికారి కల్నల్ అమిత్ పాండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ అధికారి గణపతిరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఎన్ఎస్ఎస్.. పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడులోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవా గుణం, దాతృత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యాపకులు వాణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విజయబాబు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ విజయ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం కమిటీ సమావేశం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలను యంత్రాంగం పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. స్థానిక అమరవీరుల భవనంలో నాగరత్నం అధ్యక్షతన సీపీఎం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. పట్టణంలో జనావాసాల మధ్య గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బార్‌లను తొలగించాలన్నారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు.. ఆదాయం పట్టు

కేవీకేలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ



ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: సాధారణంగా కొబ్బరికాయ కొడితే నీళ్లు తాగుతాం. కొబ్బరిని కూరల్లో వినియోగిస్తాం. ముఖ్యంగా కోసి ఎండబెట్టి నూనె ఆడిస్తాం. కానీ కొబ్బరితో బిస్కట్లు, చాక్లెట్లు, కోకోనట్ ఆయిల్, పచ్చళ్లు, క్రీమ్, కుకీస్, స్క్వాష్, చిప్స్, పొడి, కొబ్బరి పీచుతో మేట్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయవచ్చు. కొబ్బరి రైతులకు ఆదాయంతో పాటు మహిళలు, యువతకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చు. వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కొబ్బరి అభివృద్ధి బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా కేవీకేల్లోని గృహ విజ్ఞాన, ఉద్యాన శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులకు కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఈ నెల 17 నుంచి 19 వరకు శిక్షణ తరగతులు నిర్వహించారు.



కొబ్బరితో తయారు చేసిన ఉత్పత్తులు

ఇదీ లక్ష్యం..

శిక్షణ పొందిన వారు మాస్టర్ ట్రైనర్లుగా ఆయా కేవీకేల పరిధిలో కొబ్బరి రైతులు, గ్రామీణ మహిళలు, యువతకు తర్ఫీదు ఇవ్వాలి. వారు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రోత్సహించాలి. కేరళ రాష్ట్రం అలువలోని కొబ్బరి సాంకేతికత సంస్థలో మాత్రమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తొలిసారిగా జాతీయ స్థాయిలో వెంకట్రామన్నగూడెం కేవీకేలో కొబ్బరి ఉత్పత్తుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

జ్ఞాపకశక్తికి దోహదం



ఆరోగ్యం, బలం, జ్ఞాపకశక్తి అందించే పదార్థాల్లో కొబ్బరి ఒకటి. కొబ్బరితో కొత్త రకం ఉత్పత్తుల తయారీపై ఇచ్చిన శిక్షణ బాగుంది. పచ్చళ్లు, కోకోనట్ ఆయిల్, క్రీమ్, కుకీస్ తయారు చేయడం తెలుసుకున్నాం. కొబ్బరి పాల నుంచి తయారు చేసే కోకోనట్ ఆయిల్ ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలు ఉంటాయి.

- దెబోరా మెస్సియానా, కేవీకే

సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు



కల్ప వృక్షంగా పిలిచే కొబ్బరి సాగును గోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాలతో పాటు ఉత్తర కోస్తా, చిత్తూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా చేస్తుంటారు. కొబ్బరి బొండాలు, కాయలు ద్వారా మాత్రమే రైతులకు ఆదాయం వస్తోంది. కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణ ద్వారా ఆయా జిల్లాల్లోని కేవీకేల ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. దీనిని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చు.

-కరుణ శ్రీ, ప్రధాన శాస్త్రవేత్త, వెంకట్రామన్నగూడెం, కేవీకే

ప్రాసెసింగ్‌తో ఉపాధి



కొబ్బరి ప్రాసెసింగ్‌తో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని సొంతంగా ఉపాధి పొందవచ్చు. కొబ్బరి పీచు నుంచి తయారు చేసే పీచును నర్సరీలో ఎక్కువగా వినియోగిస్తారు. కొబ్బరిలో కొవ్వు ఉండదు. వర్జిన్ కోకోనట్ ఆయిల్ రోజుకు 1 మి.లీ.- 2 మి.లీ. పిల్లలకు పట్టిస్తే తీసుకుంటే చాలా అనారోగ్య సమస్యలు దరిచేరవు.

-శ్రీలక్ష్మి, ఉద్యాన శాఖాధికారి, తాడేపల్లిగూడెం

సాగుకు ప్రోత్సాహం



అన్ని కాలాల్లోనూ కొబ్బరి అందుబాటులో ఉంటుంది. కొబ్బరి సాగు ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. నా పరిధిలో 1,700 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రైతులు, మహిళలు, యువతకు కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పిస్తా.

- కరణ్, ఉద్యాన శాఖాధికారి, ఏలూరు

ప్రయోగపూర్వకంగా తెలుసుకున్నా



వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో డిగ్రీ, పీజీ చదివి గుజరాత్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశా. కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి విన్నా. మొదటిసారిగా ప్రయోగపూర్వకంగా తెలుసుకున్నా. నా పరిధిలో 10 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. స్వయం ఉపాధికి ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయి.

- జి.కోటేశ్వరరావు, ఉద్యాన శాఖాధికారి, కొత్తపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	:79950 67078
పెంటపాడు	:79939 36123
తణుకు గ్రామీణ	:85558 50851
అత్తిలి	:91548 46774

పెంటపాడు న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు గాంధీబొమ్మ కూడలి నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాల వరకు పలు వీధుల వద్ద చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. **- శ్రీనివాస్, గ్రామస్థుడు**

సమాధానం : పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగిస్తాం. **- శోభన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పెంటపాడు మండలం ప్రత్తిపాడు వద్ద కాలువలో మురుగుబోదెలు అధ్వానంగా మారాయి. **- రమణ, స్థానికులు**

సమాధానం : మురుగుబోదెలను బాగు చేస్తాం. **- ప్రసాద్, ఈవోపీఆర్డీ**



అవగాహన కల్పిస్తున్న ఏవో రాఘవేంద్రరావు

రైతుల సంక్షేమానికే 'పొలం పిలుస్తోంది'

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికే సర్కారు 'పొలం పిలుస్తోంది' చేపట్టిందని ఇరగవరం ఏవో రాఘవేంద్రరావు అన్నారు. యర్రాయిచెరువు, అడ్డగుడిపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి మంగళ, బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచులు ఉమామహేశ్వరరావు, గంగాధర్‌రావు, వివిధ శాఖల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొంతువారిపాలెంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి రాజేశ్, పశు సంవర్థకశాఖ సహాయ సంచాలకులు నరసింహారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్,న్యూస్‌టుడే: పడాలలో 'పొలంపిలుస్తోంది' వ్యవసాయశాఖ మండల అధికారి ఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వీఎంగూడెం ఉద్యానవర్సిటీ శాస్త్రవేత్త చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక నేడు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండల కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నామని ఎంపీడీవో విశ్వనాథ్ తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు

గణపవరం, న్యూస్‌టుడే: పిప్పరలో మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు 89వ జన్మదినాన్ని అఖిలపక్ష నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు, వివిధ పార్టీ నాయకులు రామకృష్ణంరాజుతో కేక్ కోయించి అభినందనలు తెలిపారు. తన తండ్రి నిర్మించిన పిప్పర ఉన్నత పాఠశాల అభివృద్ధికి మాజీ మంత్రి రూ.లక్ష విరాళమిచ్చారు.

సమష్టి కృషితో సమగ్ర ప్రగతి: కలెక్టర్

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : సమష్టి కృషితో సమగ్ర ప్రగతి సాధ్యమని కలెక్టర్ నాగరాణి అన్నారు. అత్తిలి మండలం మంచిలిలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కలెక్టర్ నాగరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహార కిట్లు అందజేశారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచారు. పీడీ సుజాతరాణి, తాడేపల్లిగూడెం ఆర్డీవో శివన్నారాయణరెడ్డి, అత్తిలి తహసీల్దార్ వంశీ, డీఎంహెచ్‌వో మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు,



సీమంతాలు నిర్వహిస్తున్న నాగరాణి, ఎమ్మెల్యే రాధాకృష్ణ

పీహెచ్‌సీ తనిఖీ.. అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మంచిలి ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సేవల్లో లోపాలు వస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.

పెంటపాడు, న్యూస్‌టుడే : రైతుల సమస్యల పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన పెంటపాడు మండలం దర్శిపర్రు వ్యవసాయక్షేత్రాల్లో వ్యవసాయశాఖ ఏడీఏ మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలాల రీసర్వేలో భాగంగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దర్శిపర్రులో కొంత వ్యవసాయ భూమి తాడేపల్లిగూడెం పట్టణంలో కలిసిపోయిందన్నారు. సంబంధిత రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాయితీపై యంత్రాలు,

రాయితీపై యంత్రాలు అందిస్తాం: బొలిశెట్టి



ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టార్పాలిన్లు, తదితర సామగ్రి అందిస్తామని పేర్కొన్నారు. సర్పంచి కోలా శేషవేణి, పుల్లా బాబీ, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పాలూరి వెంకటేశ్వరరావు, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: చేతివృత్తిదారులను ఆదుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక తాలూకా కూడలి వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్కెట్ చేతి వృత్తిదారులకు ఊతంగా ఉంటుందన్నారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆరుగొలనులో ఎన్డీయే నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొని మాట్లాడారు. తెదేపా,భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జులు వలవల బాబ్జీ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు స్థానిక బెల్ వెదర్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2 లక్షల విలువైన చెక్కు మంగళవారం ఎన్డీయే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వరద బాధితులకు చేయూతనందించడం అభినందనీయమన్నారు.

డీఆర్ బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న హరికుమార్

తాడేపల్లిగూడెం వన్ టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పింఛన్‌దారుల కార్యవర్గ సమావేశం సంఘ భవనంలో మంగళవారం హరికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం వందరోజుల పరిపాలనకు అభినందలు తెలిపారు. 2018 నుంచి పింఛన్‌దారులకు డీఆర్ బకాయిలు చెల్లించాలని కోరారు. బాలకృష్ణ, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పడమరవిప్పర్రులో సొసైటీ మహాజనసభ

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం పడమరవిప్పర్రులోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం పర్సన్ ఇన్‌ఛార్జి లక్ష్మీకాంతం అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు బోణం నాగసత్యనారాయణ మూర్తి, సొసైటీ కార్యదర్శి ప్రసాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవిరైన ఆహ్లాదం..!

అధ్వానంగా ఉద్యానాలు



◆ ఇది ఒకటో వార్డు న్యూ బ్యాంకు కాలనీలోని ఉద్యానవనం. 2014లో రూ. 20.52 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో ప్రారంభించారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఇవి విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. తుప్పుపట్టడంతో ప్రమాదకరంగా మారాయి.

◆ బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధులతో రూ. 9.69 లక్షలు వెచ్చించి చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కు నిర్మించారు. చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలు, వాటిపై అవగాహన కల్పించడానికి సిగ్నల్స్, సింబల్స్‌ను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ అధ్వానంగా మారింది. ఇక్కడ ఉండే విద్యుత్తు మీటర్‌కు సపై ఉన్నా.. విరిగిపోయి వేలాడుతోంది. కుర్చీ బల్లలు మూలకు చేరాయి.



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

గత పాలకుల నిర్లక్ష్యంతో తణుకు పట్టణంలో ఆహ్లాదం ఆవిరైంది. ఉరుకులు పరుగుల జీవితంలో తణుకు పట్టణ ప్రజలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాలతో ఒత్తిడికి గురైవారు కాసేపు సేద తీరేందుకు సరైన పార్కు లేకుండా పోయింది. చిన్నారులు, విద్యార్థులకు ఆటవిడుపు కరవైంది. గత తెదేపా హయాంలో పట్టణంలో పలు చోట్ల ఉద్యానవనాలను అందుబాటులోకి తీసుకొచ్చి, పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దారు. అయితే గత అయిదేళ్లల్లో వాటిని అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేయడంతో చిట్టడవులను తలపిస్తూ, విషసర్పాలకు కేంద్రంగా మారాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రాధాకృష్ణ వీటిపై ప్రత్యేక శ్రద్ధచూపి వాటిని అందంగా తీర్చిదిద్దాలని ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఉద్యానవనాలను అందంగా తీర్చిదిద్దడానికి ప్రతి పాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.



ఇరగవరం కాలనీలోని బీసీ వసతి గృహం సమీపం లోని ఉద్యానవనం దుస్థితి ఇది. కాలనీలో సుమారు 2000 మంది వరకు జనాభా ఉన్నారు. కాలనీవాసులు సేద తీరేందుకు పచ్చనిగడ్డితో అందంగా తీర్చిదిద్దారు. అయిదేళ్లల్లో కనీసం పట్టించుకోకపోవడంతో తుప్పలు పెరిగాయి.

ఇదీ పరిస్థితి

సుమారు 95000 జనాభా ఉన్న పట్టణంలో పది పార్కులు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు ఏటా రూ. 10లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. అయిదు ఉద్యానవనాలకే నిర్వాహకులను ఏర్పాటు చేశారు. ఉద్యానవనాలు పలు చోట్ల నిర్వాహణ లేక మందుబాబులకు నిలయాలుగా మారాయి.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: కాగుపాడుకు చెందిన పెట్ల పార్వతి వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కామేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. గ్రంథాలయాలకు పుస్తకాలు సమకూర్చారు. వీటిని సర్పంచి కడియాల సుధేష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచి విధేష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు.

ఎయిర్‌స్ట్రిఫ్ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం గణేశ్‌నగర్‌లో ఎయిర్‌స్ట్రిఫ్ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సైక్లింగ్, షార్ట్‌పుట్ పోటీలు పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ మురళీకృష్ణ ప్రారంభించారు. యోగా గురువు చంద్రశేఖర్, పూర్వాధ్యక్షుడు రాగిరెడ్డి నాగవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పురపాలక కార్యాలయం ఎదురుగా ..

ముంచెత్తిన వాన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, కడకట్ల ,యాగర్లపల్లి, భాగ్యలక్ష్మిపేట, మహలక్ష్మినగర్, సవిత్రుపేట, దొమ్మర్ల కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హౌసింగ్‌బోర్డులోని ప్రధాన రహదారి పైకి నీరు చేరి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలోకి నీరు చేరింది.



హౌసింగ్ బోర్డు కాలనీ : నివాసంలో వర్షపు నీరు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఎంపీడీవో శ్రీనివాసు సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా మంగళవారం ఇరగవరంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిట్ రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. పరిసరాలను విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలన్నారు.

ఆర్టీసీ ప్రాంగణంలో.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ డిపో ప్రాంగణంలో శశి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛ భారత్ మంగళవారం నిర్వహించారు. అనంతరం పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.

పరిశుభ్రతపై అవగాహన



ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది



మొక్క నాటుతున్న రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

విద్యార్థుల ప్రతిభ.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 2కే రన్‌లో చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సుబేశ్, హిమేష్, లక్ష్మీనారాయణ మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు.

నేడు 5కే రన్.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం 5కే రన్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ మురళీ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా జట్ల ఎంపిక

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గం తరపున కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగాకు జిల్లా జట్ల ఎంపిక మంగళవారం నిర్వహించినట్లు సమన్వయ కర్త సంకు సూర్యనారాయణ తెలిపారు. డీవైఈవో మురళి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని పద్మావతి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. సుమారు 380 మంది క్రీడా పోటీల్లో పాల్గొనగా ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయికి 80 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు జాన్సన్, వినోద, సోమయాజులు, నాగరాజ్యం, సుబ్బారావు, అప్పారావు, రవి, శ్రీనివాస్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు

ప్రమాదకరంగా ప్రయాణం..

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు అత్తిలి నుంచి తణుకు పట్టణానికి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. కొంత మంది యువకులు బస్సు ద్వారం వద్ద నిలబడి ప్రయాణాలు చేస్తున్నారు. అసలే గోతుల దారి కావడంతో అదుపుతప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఉదయం సమయంలో మరో బస్సు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సమాజ సేవలో భాగస్వాములుకండి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రధానాచార్యుడు టీకే విశ్వేశ్వరరావు అన్నారు. నారాయణపురంలోని శ్రీఅరవింత శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ✶ కళాశాలలో బాలల హక్కుల న్యాయవాద ఫౌండేషన్ ఆధ్వర్యాన బాల్య వివాహాలు- అనర్థాలపై అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త చమటపల్లి రేఖ హాజరై బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.



వాయుపుత్రుని దర్శనానికి బారులు

అప్పనవీడు (పెదపాడు), న్యూస్‌టుడే : అప్పనవీడు అభయాంజనేయస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు, విశేషనామార్చనలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన తవ్వ పూర్ణచంద్రరావు, నాగవెంకటదుర్గా దంపతులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధనను నిర్వహించారు.